ఓటరు నాడి అంతుబట్టేదెలా..?

- సైలెంట్ ఓటింగ్ కారణంగా సర్వత్రా నెలకొన్న ఉత్కంఠ
- కౌంటింగ్ రోజు కోసమే అందరి ఎదురుచూపు
- విజయం తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు



అమలాపురం టౌన్: ఓట్ల పండగ ముగిసింది. తుది తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. కౌంటింగ్ ముగిసినప్పటి నుంచి అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులంతా పట్టణం, మండలాలు, గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారీగా ఎక్కడెక్కడ తమకు ఎంతెంత ఓటింగ్ పడిందో లెక్క గట్టేందుకు కసరత్తులు సాగిస్తున్నారు. దిగువ స్థాయి నేతలతో భేటీ అయ్యి సమాలోచనలు సాగిస్తున్నారు. ఏయే ప్రాంతాల్లో తమకు మెజార్టీ వస్తుందో, ఎక్కడ తమకు తక్కువ ఓట్లు పడి ఉంటాయో అంచనా వేసేందుకు కుస్తీ పడుతున్నారు. ఒకటికి రెండుసార్లు లెక్క లేసినా సరే ఓటరు నాడి మాత్రం ఎవరికీ అంతుబట్టట్లేదు. అందుకే రెండు నియోజకవర్గాల్లోనూ పార్టీల నాయకులు, కార్యకర్తలే కాదు సామాన్య ఓటర్లు సైతం కౌంటింగ్ రోజు కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

సైలెంట్ ఓటింగ్ ఎటు పడినట్లు

అమలాపురం నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 74.05 శాతం ఓటింగ్ నమోదైతే ఈసారి ఎన్నికల్లో ఏకంగా 82.38 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకర్గంలో మొత్తం ఓటర్లు 2,13,508 మంది ఉంటే వీరిలో 1,75,890 మంది ఓటర్లు ఓటేశారు. ఈ దఫా ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది శాతానికి పైగా ఓటింగ్ పెరిగింది. ముమ్మిడివరం నియోజకవర్గంలోనూ 2019 ఎన్నికల్లో 83.77 శాతం ఓటింగ్ నమోదైతే ఈసారి 83.48 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ రోజున రాత్రి 9 గంటలైనా సరే క్యూ నుంచి కదలకుండా ఓపికగా ఎదురుచూసి మరీ ఓటర్లు తమ తీర్పునిచ్చారు. పైగా ఈసారి యువత, మహిళలు, వృద్ధులు ఎక్కువగా పోలింగ్ బూత్‌ల బాట పట్టి ఓటేశారు. దీంతో పాటు ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఇతర పట్టణాల్లో ఉంటున్నవారు సైతం ఓట్ల పండగకు సొంతూరికి వచ్చి బాధ్యతగా ఓటేశారు. పూర్తి సైలెంట్ ఓటింగ్ కారణంగా వీరంతా ఎటువైపు మొగ్గారన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు. ఇదే ఇరు పార్టీల నేతలకు కునుకు లేకుండా చేస్తుంది. పోలింగ్ శాతం పెరగడం వెనక అసలు కారణమేంటో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మంగళం పాడతారన్న భయంతోనే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారని వైఎస్సార్ సీపీ నాయకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల వల్ల అత్యధికంగా లబ్ధి పొందిన మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు ఎక్కువగా రావడానికి కారణం అదేనంటున్నారు. మరోవైపు టీడీపీ నేతలు మాత్రం ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ కారణంగానే ఎక్కువమంది ఓట్లు వేశారంటూ భాష్యం చెబుతున్నారు.

అంచనాలు.. ఆందోళనలు..

ఎవరు అవునన్నా కాదన్నా ఈసారి ఎన్నికలు హోరాహోరీగా జరిగాయన్నది బహిరంగ రహస్యమే. అయితే ఇటు వైఎస్సార్ సీపీ, అటు టీడీపీ అభ్యర్థులు మాత్రం క్షేత్రస్థాయి లెక్కలతో ఎవరికి వారే గెలుపు తమదేనని ఢంకా బజాయిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని, మహిళలు, వృద్ధుల ఓటింగ్ తమకే పడిందని మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయంపై పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విజయం తనదేనని పైకి చెబుతున్నా ఓ ప్రధాన సామాజిక వర్గం నాయకులు తన వెంటే తిరిగినా ఓటింగ్‌కు వచ్చేసరికి విముఖత చూపించారనే సమాచారంతో గుబులు చెందుతున్నట్లుగా టీడీపీ వర్గాలంటున్నాయి. పైగా టీడీపీ రెబెల్ అభ్యర్థి(స్వతంత్ర) పరమట శ్యామ్ వల్ల ఓట్లు చీలి తనకు ప్రతికూల పరిస్థితులు తప్పవేమోనని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తుంది. ముమ్మిడివరం టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సైతం కూటమి బలంతో గెలుస్తామని చెబుతున్నా సైలెంట్ ఓటింగ్ వైఎస్సార్ సీపీకి పడిందేమోనని ఆందోళన చెందుతున్నట్లుగా టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే మరో 20 రోజుల వరకూ ఫలితాలు తేలే అవకాశం లేకపోవడంతో జూన్ 4వ తేదీ ఎప్పుడెప్పుడొస్తుందా అందరూ ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

22 మంది విద్యార్థుల రక్తదానం



బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగుల కోసం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో స్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 22 మంది విద్యార్థులు బుధవారం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యోగా విద్యార్థులను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులతో పాటు యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ అభినందించారు.

22 మందికి కళ్లజోళ్ల అందజేత



బాధితులకు కళ్లజోళ్లను అందజేస్తున్న నేత్ర వైద్యుడు సీరం సత్తిబాబు

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షల అనంతరం 22 మందికి కళ్లజోళ్లను బుధవారం ఉచితంగా అందజేశారు. మండల కేంద్రమైన తాళ్లరేవు సచివాలయం–2 పరిధిలో నేత్ర పరీక్షల అనంతరం 22 మంది బాధితులకు కళ్లజోళ్లను నేత్ర వైద్య నిపుణుడు సీరం సత్తిబాబు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం జ్యోతి, మీనాక్షి, ప్రసాద్, విమల, కాసులమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని మూలవిరాట్‌కు పూర్ణాభిషేకం



వేంకటేశ్వరస్వామి

తాళ్లరేవు: భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో పూర్ణాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు



బహుమతులు అందుకున్న యానాం క్రీడాకారులు

యానాం: పుదుచ్చేరి పీఏపీ గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహుమతుల ప్రదానోత్సవంలో స్పోర్ట్స్ అండ్ యూత్ ఎఫైర్స్ ప్రభుత్వ కార్యదర్శి అమరనాథ్ ఆర్ తల్వాడే, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రియదర్శిని పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన క్రీడల్లో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లకు చెందిన 8 జోన్ల పరిధిలోని 640 మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. అథ్లెటిక్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన యానాం క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల సొమ్ము జమ చేయాలి

అమలాపురం రూరల్: ఎన్నికల కారణంగా నిలిపేసిన రైతులకు పెట్టుబడి రాయితీ(ఇన్‌పుట్ సబ్సిడీ), విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం వంటి పథకాల నిధులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

సీనియర్ అసిస్టెంట్ బాబులు మృతికి సంతాపం

సఖినేటిపల్లి: సుదీర్ఘ కాలం అంతర్వేది దేవస్థానం వీఆర్వోగా పనిచేసిన పూర్వ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం మలికిపురం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పోతురాజు వెంకట నరసింహ కుమార్(బాబులు)ఆకస్మిక మృతికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం అంతర్వేదికరలో బాబులు కుటుంబ సభ్యులను వేమా పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రెయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్య ప్రకాశరావు, నాయకులు చెల్లింగి త్రినాథ్, పోతురాజు సురేష్ పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



కేశనకుర్రులో కాటన్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఐ.పోలవరం: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని దంగుడుబియ్యం నాగమోహనరావు, పి.వెంకటేశ్వరావు తదితరులు ఐ.పోలవరం గ్రామంలో ఉన్న కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేశనకుర్రుపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతి రాజు, ఇందుకూరి రంగరాజు తదితరులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురమళ్ల పీఏపీ సెక్షన్ వద్ద, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాటన్ ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి గోదావరి డెల్టా ప్రాంత ప్రజలకు ఆరాధ్య దైవమయ్యారన్నారు.

అల్లవరం: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ ఉభయ గోదావరి జిల్లాల రైతుల ఆరాధ్యుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని బెండమూర్లంకలో రైతు నాయకుడు యాళ్ల వెంకటానందం తదితరులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోడితిప్ప పంచాయతీ పరిధిలోని గోపాయిలంక వద్ద సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి అడపా కృష్ణప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కాటన్ మహాశయునికి ఘన నివాళి

తాళ్లరేవు: ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పత్తిగొంది పంట కాలువ చెంతన ఉన్న విగ్రహానికి ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాటన్ మహాశయుడు గోదావరిపై ఆనకట్ట కట్టించడం వల్లే ఉభయ గోదావరి జిల్లాల్లో అన్నిరకాల పంటలు పండుతున్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజలందరూ ఆయన్ను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో దున్నా గంగరాజు, దుప్పి అదృష్టదీపుడు, తాతపూడి రాజారత్నం, ఎలిపే నాగేశ్వరరావు, నల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సర్ ఆర్థర్ కాటన్‌కు నమస్కరిస్తున్న దొరబాబు, వెంకటానందం



పత్తిగొందిలో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ముసుగూ తీయలేదు.. దండా వేయలేదు..



అమలాపురం కాటన్ పార్కులో ముసుగు వేసి ఉన్న కాటన్ విగ్రహం

అమలాపురం రూరల్: అపర భగీరథుడు, డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్‌కు రాజకీయాలతో సంబంధమేముంటుంది? సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు వేయాల్సి ఉంటే అమలాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న కాటన్ పార్కులో కాటన్ నిలువెత్తు విగ్రహానికి ముసుగు కప్పేశారు. పోనీ కనీసం పోలింగ్ ముగిశాకనైనా కాటన్ విగ్రహానికి వేసిన ముసుగు తీయలేదు. కాటన్ మహాశయుని జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి దండ వేద్దామంటే ఎన్నికల కోడ్ అంటూ అభ్యంతరం తెలపడం ఎంత వరకూ సమంజసమని రైతులు, కాటన్ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోడూరుపాడులో తాటాకిల్లు దగ్ధం



కోడూరుపాడులో దగ్ధమవుతున్న తాటాకిల్లు

అల్లవరం: మండలంలోని కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని మాకేవారిపేటలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొడమంచిలి మంగాదేవికు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సర్వస్వం మంటల్లో కాలిపోయాయని, కట్టుబట్టలు మినహా ఏమి మిగల్లేదని బాధితురాలు మంగాదేవి కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదంలో రూ.2 లక్షల వరకూ ఆస్తి నష్టం సంభవించినట్లుగా అంచనా వేస్తున్నారు.

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నియామకానికి వినతి



మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని కోరుతూ వినతిపత్రం అందిస్తున్న నాయకులు

యానాం: పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నియామకం జరగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇన్‌చార్జి రీజినల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ జె.శివసుబ్రహ్మణ్యంకు యానాం హ్యూమన్ ఫర్ సర్వీసెస్ అధ్యక్షుడు గుత్తుల జయరామారావు తదితరులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నియామకం లేకపోవడంతో గత 6 నెలలుగా లైసెన్స్‌ల జారీ, స్లాట్ల బుకింగ్, నూతన వాహనాల రిజిస్ట్రేషన్స్, రెన్యువల్స్, పాత వాహనాలకు లైఫ్ సర్టిఫికెట్లు నిలిచిపోయాయన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు లైసెన్స్‌ల కోసం వచ్చి సమయం వృథా చేసుకుంటున్నారన్నారు. కొత్తగా కొంటున్న వాహనాలకు నెలలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని, కాని అది జరగక జరిమానాతో పోలీసుల ఎన్‌ఓసీ తీసుకు రావాల్సి వస్తుందన్నారు. ఎల్ఎల్ఆర్‌లు, ల్యాప్స్ అవుతున్న డ్రైవింగ్ లైసెన్స్‌లకు రెన్యువల్స్ కావడం లేదన్నారు. తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లంక బంగారం, పెసల వెంకటేష్, కాదా పవన్, సీహెచ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మార్పణ్‌కు 500 రోజులు



అభాగ్యురాలికి క్యారియర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ ఉచిత భోజన పథకానికి 500 రోజులు పూర్తయ్యాయని క్లబ్ సభ్యులు తెలిపారు. ఎటువంటి ఆదాయం, ఆదరణ లేని పది మందికి రోజూ దాతల సహకారంతో స్వయంగా అభాగ్యుల ఇంటి వద్దకే క్యారేజీను అందజేస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి అమలు చేస్తున్న ఈ పథకం 500 రోజులు పూర్తి చేసుకోవడంపై క్లబ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలమూరులో చిన్నారులకు టీకాలు



కలవచర్లలో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్‌ఓ పి.రాధాకష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటి బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి చేయూత

అయినవిల్లి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మాగం గ్రామానికి చెందిన అంబటి నరసింహమూర్తికి సూరపరెడ్డి సురేష్ బుధవారం చేయూత నందించారు. నరసింహమూర్తి కష్టాలు తెలుసుకున్న ఉప్పలగుప్తం మండలానికి చెందిన సురేష్ ఆధ్వర్యంలో గారపాటి రిషిబాబు, రవి సత్యనారాయణ, నాగదుర్గలు బాబి మాస్టర్ చేతుల మీదుగా నెల రోజులకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. వీరిని వివేకానంద సేవా సమితి సభ్యులు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం అదే గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గూటం శ్రీనివాస్‌రావు, నాగలక్ష్మిభారతి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని దాత కుటుంబం ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మిడివరం: స్థానిక యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడ్ యునైటెడ్ ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది రోగులకు బీపీ, షుగర్, రక్తశాతం పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తమ బ్యాంకు ఖాతదారులకు అందించే సేవల్లో భాగంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని బ్యాంకు మేనేజర్ అచ్చిరాజు తెలిపారు.

థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా అన్ని వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, లేదంటే జరిమానా విధిస్తామని ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.కుమరన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కేంద్ర రవాణా, హైవేస్ మంత్రిత్వశాఖ మోటార్ వెహికల్ చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని రిజిస్టర్డ్ వాహనాలకు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి చేసిందన్నారు. దీనికి సంబంధించిన వివరాలు వెహికల్ పోర్టల్‌లో ఉన్నాయన్నారు. ఇన్సూరెన్స్ కాని వాహనాలను ట్రాన్స్‌పోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్స్ గుర్తించి మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం జరిమానా విధిస్తున్నామన్నారు

అల్లుకున్న నిర్లక్ష్యం



భీమనపల్లిలో విద్యుత్ స్తంభానికి చుట్టుకున్న పాదులు



గొల్లవిల్లిలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పాదులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు తీగ జాతికి చెందిన పాదులు అల్లుకున్నాయి. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పాదులు విద్యుత్ వైర్లకు తగిలి తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రధాన రహదారి చెంతనే ఈ పరిస్థితి ఉన్నా విద్యుత్ అధికారులు తరచూ ఆ మార్గం మీదుగానే వెళుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ చిత్రం బుధవారం అటుగా వెళ్తున్న సాక్షి కెమెరాకు చిక్కింది.

కలవర పెడుతున్న రుతు పవనాలు

- హడావుడిగా పంట ఒబ్బిడి పనులు
- కూలీల కొరతతో సతమతమవుతున్న రైతులు




ముమ్మిడివరం మండలం గాడిలంకలో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు

ముమ్మిడివరం: ఒకటి రెండు రోజుల్లో రుతు పవనాలు ముంచుకొస్తున్నాయన్న వాతవరణశాఖ హెచ్చరికలు రైతులను కలవర పెడుతున్నాయి. ఇప్పటికే రబీ కోతలు కోసి ధాన్యం రాశులను కళ్లాల్లోనే ఉంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చి ధాన్యం అమ్ముకుని సొమ్ములు చేసుకుందామన్న తరుణంలో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ముమ్మిడివరం నియోజక వర్గంలో 38,000 ఎకరాల్లో రబీ పంట సాగు చేశారు. ఇప్పటివరకు దాదాపు 90 శాతం కోతలు పూర్తయ్యాయి. గత రెండు రోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం కనిపిస్తుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో ఎక్కడ చూసినా కోసిన పంటను కుప్పలు వేయడం, కుప్పలు నూర్చడం వంటి పనులు చేపట్టారు. ఒకేసారి అన్ని పనులు చేపట్టడం వల్ల అవసరాలకు తగ్గ కూలీలు దొరక్కపోవడం రైతులకు శాపంగా మారింది. పైగా అందరికీ ఒకేసారి కూలీల అవసరం రావడంతో కూలి రేట్లు అమాంతంగా పెరిగిపోయాయి. వాతవరణ మార్పులతో పంట దిగుబడుల కంటే పెట్టుబడులు అధికమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో తెగుళ్లు బారిన పడటం వల్ల దిగుబడులు సైతం గణనీయంగా తగ్గే అవకాశముందని చెబుతున్నారు.

ముందస్తుగా ఎండు గడ్డి సేకరణ



మొసలపల్లిలో యంత్ర సాయంతో సిద్ధమైన ఎండు గడ్డి బేళ్లు

అంబాజీపేట: వరద ప్రభావిత ప్రాంతాల్లోను, రానున్న వర్షాకాలంలో పశుపోషణకు గడ్డి కొరత లేకుండా ముందస్తుగా రైతులు ఎండు గడ్డి సేకరిస్తున్నారు. అయితే గతంలో మెషీన్‌తో గాని, కూలీలతో గాని వరి కోతలు కోసేవారు. ఎండు గడ్డిని మేటులు వేసి భద్రపరుచుకునే వారు. వాతావరణంలో మార్పుల కారణం ఒకటైతే ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉండటంతో మెషీన్‌తో కోసిన గడ్డిని యంత్ర సాయంతో 35 కేజీల బేళ్లుగా తయారు చేసి మేట్‌లు వేస్తున్నారు. అదే గడ్డిమేటు వేయాలంటే ప్రస్తుతం ఎకరానికి గడ్డి రూ.4 వేలు, మేటు వేయడానికి రూ.4 వేలు ఖర్చవుతున్నాయని అదే బేళ్ల రూపంలో మేట్‌లు వేయడం వల్ల ఖర్చులు ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు ఎండుగడ్డి కొరత లేకుండా బేళ్లను సిద్ధం చేసి ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో భద్రపరుస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఒక పక్క ధాన్యం రాశులను సంరక్షించుకుంటూ, పశువులకు ఎండు గడ్డిని ఒడ్డుకు చేర్చుకుంటున్నారు రైతన్నలు.

45 మంది రక్తదానం



మొగలికుదురులో రక్తదానం చేస్తున్న యువకులు

మామిడికుదురు: బ్రైట్ స్టోన్స్ పర్యవేక్షణలో బుద్దాల నాగరత్నం మెమోరియల్ వాలంటరీ బ్లడ్ సెంటర్, సహస్ర బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మొగలికుదురులోని శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సుమారు 45 మంది రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు ఉచితంగా బ్లడ్ గ్రూప్ నిర్ధారణ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం కోసం ఎంతో మంది ఎదురు చూస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం కార్యక్రమంలో యువకులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడి శ్రీను, యక్కల మోహర్, మానెం కమలేశ్వరరావు, నిర్వాహకులు బిళ్ల తేజ, బిళ్ల గణేష్, ఊటుకూరి మాణిక్యనాగబాబు, చెల్లింగి కృష్ణ, కొండా చినబాబి, గుంటు మోహన్‌ఈశ్వరరావు పాల్గొన్నారు.